

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## నెల్లూరులో 100 పడకలతో ఈఎస్ఐ హాస్పిటల్

### లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 8, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలో 100 పడకలతో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరంద్లజే వెల్లడించారు. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఈఎస్ఐ లబ్దిదారులకు వైద్య సేవలను అందించడానికి నెల్లూరు జిల్లాలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి మార్చి, 2019లో ప్రభుత్వం ఆమోదం తెలిపిందనేది నిజమేనా అని ఆరా తీశారు. ఆసుపత్రి కోసం జరిగిన భూసేకరణ, సిబ్బంది వసతి గృహాల కోసం అదనంగా ఒక ఎకరం భూమిని కేటాయించడం వాస్తవమేనా అని సమాచారం అడిగారు. టెండర్ ప్రక్రియ ప్రారంభంలో జరుగుతున్న జాప్యానికి గల కారణాలు, హాస్పిటల్ నిర్మాణానికి పట్టే సమయం వంటి వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి సుశ్రీ శోభా కరంద్లజే సమాధానం ఇచ్చారు. ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రెండు 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రులను ఏర్పాటు చేయడానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందన్నారు. వీటిల్లో శ్రీ సిటీలో ఈఎస్ఐ 100 పడకల ఆసుపత్రి విషయంలో సిబ్బంది క్వార్టర్లలో సహా 5 ఎకరాల భూమిని సేకరించారని, దీనికి 27.06.2025 జనవరి 196వ సమావేశంలో ఈఎస్ఐ కార్పొరేషన్ ఆమోదించిందన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబరు 8, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 14156 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 73.667టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి 12650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.990 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## నెల్లూరు జిల్లాలో విభజనను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా




**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త** సోమవారం నెల్లూరు జిల్లాలో విభజనను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నెల్లూరు నుండి మండలాల విభజనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు జవాబు చెప్పాలని బిజెపి నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. కండలేరు జలాశయం విభజన మూలంగా జలవివాదాలు నెలకొంటాయి. కరువు సమయంలో నెల్లూరు జిల్లాలో పొదలకూరు మనుబోలు ఆయ కట్టుదారులు నీటి సమస్యను ఎదుర్కొంటారు. తిరుపతి నెల్లూరు అధికారుల మధ్య జలవివాదాలు ఏర్పడతాయని రమేష్ తెలిపారు. కండలేరు ముంపు నిరుద్యోగుల ఉద్యోగాల సమస్య జటిలమవుతుందని కలవాయి నుండి నెల్లూరు 60 కిలోమీటర్లు తిరుపతికి 140 కిలో మీటర్లు దూరంలో ఉన్నందున ప్రజలు ప్రయాణ భారాన్ని ఎదుర్కొంటారని. 1882 బ్రిటిష్ కాలం నుండి రాపూర్ అటవీ క్షేత్రం కలువాయి మండలాలు ఒకే డివిజన్లో ఉన్నాయి ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన ఎర్రచందనం నెల్లూరు జిల్లా రాపూర్‌లో మాత్రమే ఉన్నందున ప్రపంచంలోనే నెల్లూరుకు గుర్తింపు ఉందని 44 లక్షల సంవత్సరాల నుండి పెనుశీల లక్ష్మీనరసింహస్వామి ఆలయం నెల్లూరు జిల్లాలోనే ఉందని. వీటిని దూరం చేసుకునేందుకు నెల్లూరు జిల్లా ప్రజల సిద్ధంగా లేరని ఎందుకు విభజన చేస్తున్నారో ఎవరి కోసం చేస్తున్నారో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరు ప్రజలకు జవాబు చెప్పాలని రమేష్ డిమాండ్ చేశారు. చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ప్రజలకు అన్యాయం జరుగుతుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారు అని ప్రశ్నించారు. ఇద్దరు ముగ్గురు వ్యక్తుల కోసం నెల్లూరు నుండి రాపూరు కలువయి సైదాపురం వేరు చేయడం బ్రిటిష్ పాలన కంటే దుర్మార్గంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కందికట్ల రాజేశ్వరి, బైరి శ్రీనివాస్, నరాల సుబ్బారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు సమాధి శ్రీనివాసులు, సోమ అనురాధ, బీసీవై పార్టీ నేతలు హాజరత్ యాదవ్, సోమ గోపాల్, మనోహర్ హింద్, ఆనందు, నరేష్, చింత గింజల సుబ్రమణ్యం, పూల ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం

### జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో యస్.పి. స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 148 ఫిర్యాదులు అందాయి. టీపి గూడూరుకి చెందిన వ్యక్తి తన కుమారుడు తిరణాళ్ళకు వెళ్లి అనుమానాస్పదంగా గుండెపోటుతో మరణించినట్లు తెలపగా, గిశి గూడూరు స్టేషన్లో అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసినట్లు, పోస్టుమార్టం రిపోర్టులో నీటిలో మునిగి చనిపోయినట్లు తెలిపారని, తన కుమారుడు చనిపోయిన ప్రాంతాల్లో నీటి గుంతలే లేవని, తన కుమారుడి మరణంపై అనుమానం ఉందని పూర్తిగా విచారించి న్యాయం చేయాలని కోరారు. చిన్న బజారు పరిధికి చెందినటువంటి వ్యక్తి తన కుమార్తె నవంబర్ 7వ తేదీ నుంచి కనిపించడం లేదని, చిన్న బజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఉన్నట్లు, త్వరితగతిన విచారించి తన కుమార్తె ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. దర్గామిట్టకి చెందిన మహిళను, తన భర్త అత్తమామలు కుటుంబ వివాద విషయమై వేధింపులకు గురిచేస్తూ అధిక కట్నం కోసం వేధిస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని అదేవిధంగా బాలాజీ నగర్ పరిధికి చెందినటువంటి మహిళను, అత్తమామలు, భర్త, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, పిల్లల లేరని, వదిలేసాడని, తనని నుండి గెంటి వేశారని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, రూరల్ డిఎస్పి జి.శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పిసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, ఎస్బి సీఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన " కలువాయి సేవ్ " నిరసన కారులు

### రోజురోజుకు ఉధృతమౌతున్న కలువాయి నిరసనలు




"కలువాయి సేవ్" తిరుపతి మాకొద్దు - నెల్లూరు జిల్లానే ముద్దు అనేనినాదంతో జెఏసి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమాలకు నిరసన కారులు పెద్దఎత్తున చేరుకొని నిరసనలు తెలియజేస్తున్నారు. సోమవారం స్ధానిక బస్టాండ్ సెంటర్ నందు అన్ని వర్గాల వారు నల్ల బ్యాడ్జిలు దరించి బైటాయించి నిరసన తెలిపారు. అదే విధంగా ప్రధాన రోడ్లుపై చేరుకొని ఒంటి కాలితో నిరసన తెలుపుతు నినదించారు. కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలన్న నినాదంతో బస్టాండ్ కూడలి హోరెత్తింది. ఈ సందర్భంగా నిరసన కారులు మాట్లాడుతు ప్రజాభిప్రాయం లేకుండా విభజన ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. వీరితోపాటు మండలంలోని వికలాంగులు యూనియన్ సభ్యులు సేవ్ కలువాయి నినాదంతో బైఠాయించారు. మండలంలోని దాచూరు, పర్లకొండ, చీపినాపి, కేశమనేనిపల్లి గ్రామాలతో పాటు పలు పంచాయితీల సర్పంచ్‌లు ఏకగ్రీవ తీర్మానంతో నెల్లూరు జిల్లాలోనే కలువాయి మండలాన్ని కొనసాగించాలంటు తీర్మానం చేస్తు గ్రామాలలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**దాచూరు సర్పంచ్ ఏకగ్రీవ తీర్మానం**

ఈ సందర్భంగా దాచూరు సర్పంచ్ రాజుల అనురాధా సచివాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు మార్చలనుకోవడం దారుణం మని అమె ఖండించారు. ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ నుండి గూడూరు రెవిన్యూ కి డివిజన్‌కు కలువాయిని మారుస్తు గెజెట్ నోటిపికేషన్ విడుదల చేయడం పట్ల ప్రజలు ఆందోళనకు గురౌతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని విధాలా తీవ్ర నష్టాన్ని గురిచేసే ఈవిభజన ప్రభుత్వం స్పందించి విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**నేడు ఎమ్మెల్యే కురుగొండ్లను కలవనున్న జెఏసి నేతలు**

వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణను నేడు కలువాయి జెఏసి నాయకుల ఆద్వర్యంలో అన్ని వర్గాల వారు కలిసి కలువాయి సేవ్ నినాదాన్ని ఆయనకు తెలియజేయనున్నట్లు వారు తెలిపారు.

## తప్పు చేస్తే దండన తప్పదు : నగరంలో బ్లేడ్ బ్యాచ్ ఊరేగింపు



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదంటూ అందరికీ మరోసారి తెలిపే ప్రయత్నం చేశారు నెల్లూరు నగర పోలీసులు. ఆదివారం రాత్రి కేవలం రోడ్డుకు అడ్డంగా ఉన్న బైక్ ను పక్కకు తొలగించమని చెప్పినందుకు, కొందరు గంజాయి బ్యాచ్ ప్రైవేట్ బస్సు డ్రైవర్, కండక్టర్ పై బ్లేడుతో విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచిన విషయం విధితమే. ఈ కేసులో ముద్దాయిలను సంతపేట సీఐ సోమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది 24 గంటల్లోగా పట్టుకోవడం జరిగింది. ప్రజల్లో భరోసా కల్పించేందుకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముద్దాయిలను నెల్లూరు నగరంలో సోమవారం రాత్రి ఊరేగింపుగా నడిపించారు. గాంధీ బొమ్మ సర్కిల్ ప్రాంతం నుండి ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ ప్రాంతం వరకు ముద్దాయిలైన ఐదు మందిని పోలీసులు నడిపిస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సంతపేట సిఐ సోమయ్య మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, భయభ్రాంతులకు గురి చేసేలా ఎవరు ప్రవర్తించిన ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి దుర్మరణం





**ఇందుకూరుపేట, డిసెంబర్ 8, ప్రభాతవార్త** ఆర్టీసీ బస్సు ఢీకొని ఆరవ తరగతి చదువుతున్న పులి కిరణ్(9) అనే విద్యార్ధి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని గంగపట్నం మజారా వెంకటరెడ్డి కాలనీకి చెందిన పులి ప్రదీప్ 9వ తరగతి, పులి కిరణ్ ఆరవ తరగతి చదువుతున్న అనే ఇద్దరు అన్నదమ్ములు సైకిల్ పంచర్ వేసుకునేందుకు గంగపట్నం వెళ్తుండగా వేపచెట్టు సెంటర్ వద్ద ఆర్టీసీ బస్సు వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొనడంతో కిరణ్(9) అనే బాలుడు అక్కడే మృతి చెందాడు. ప్రదీప్ స్వల్ప గాయాలతో భయపడ్డాడు. గత 7 నెలల కిందట తండ్రి పులి మురళి విద్యుత్ ఘాతంతో మృతి చెందడంతో తల్లి సంరక్షణలో ప్రదిప్ కిరణ్ జీవనం సాగిస్తున్నారు. అన్న ప్రదీప్ కళ్ళ ఎదుట మృతి చెందిన తమ్ముడు కిరణ్ మృతదేహాన్ని చూసి విలవిలాడిపోయాడు. భర్తను కోల్పోయి కూలీ, నాలి చేసుకుని తన ఇద్దరు బిడ్డలతో జీవనం సాగిస్తున్న తల్లి మనోజ్ కుమారి కుమారుడి మృతదేహం వద్ద తల్లడిల్లిపోయింది. చేతి కందిన కుమారుడు మృతి చెందడంతో తల్లి రోధన హృదయ విచారకరమైంది. స్థానికంగా నివాసం ఉంటున్న వెంకటరెడ్డి కాలనీలో విషాధఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బాలుడు మరణ వార్త తెలుసుకుని మండల టీడీపీ అధ్యక్షులు పవన్ రెడ్డి చేత తక్షణ సాయంగా రూ.20వేలు అందజేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బస్సు డ్రైవర్ భాషను అదుపులోకి తీసుకుని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి దుర్మరణం

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే





**ఇందుకూరుపేట, డిసెంబర్ 8, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం గంగపట్నం సమీపంలోని వెంకటరెడ్డి కాలనీ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని కిరణ్ అనే 6వ తరగతి చదివే విద్యార్థి మృతిపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి మృతి చెందిన సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్థానిక టీడీపీ నాయకులను సంఘటన స్థలానికి పంపించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేస్తూ బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతని తెలియజేశారు. ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని ఈ విషాధ సమయంలో వారికి భగవంతుడు దైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకించి విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తలు పాటించేలా చూడాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు.

## అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

### - పరిష్కార వేదికకు 317 అర్జీలు జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల





**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త** సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్‌వో విజయకుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్‌రెడ్డి, డి.పి.ఓ వసుమతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు రఘు రామ రాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేక పోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు కాగా వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతో పాటు షామియానాలు వేసి నీడను కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పంచాయతీరాజ్ శాఖ యస్.ఈ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పాతిక సంవత్సరంలో పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిచే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

**పరిష్కార వేదికకు 317 ఫిర్యాదులు**

సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 317 ఫిర్యాదులు అందాయని అందులో అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 152, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించి 17, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 20, పంచాయతీరాజ్ 20, పోలీస్ శాఖకు సంబంధించి 23 మిగతావి ఉన్నాయన్నారు.

## రెండు నియోజకవర్గాలకు సంబంధించిన

### - జెండాదిబ్బ రోడ్డుకు మోక్షం ఎప్పడు

### - ప్రజలు అవస్థలు పడాల్సిందేనా!



**బుచ్చి డిసెంబర్ 8 ప్రభాతవార్త** ముంబాయి రోడ్డు నుండి బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలో ప్రారంభమైన సంగం మండలం జెండాడిబ్బ నుండి పంచేడు వరకు ఉంది. ఈ రోడ్డు అటు ఆత్మకూరు నియోజకవర్గానికి కొంత, కోవూరు నియోజకవర్గానికి కొంత వస్తుంది. రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. బుచ్చిరెడ్డిపాళెంలో ప్రారంభం నుండి ఈ రోడ్డులో వెళ్ళాలంటే ప్రజలు నరకం చూస్తున్నారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి ఈరోడ్డు పూర్తి స్థాయిలో వేయించాలని జెండాదిబ్బ, పంచేడు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు



**సంగం డిసెంబర్ 8 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమా దాల నివారణకు నెల్లూరు జిల్లా ఎస్పి అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు దువ్వూ రు,పెరమన, సంగం వద్ద ఎన్హెచ్-7పై జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాల్, సిఐ గంగా దర్,ఎస్ఐ రాజేష్,మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ రాములు సంయుక్తంగా ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు. గతంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలు, ప్రమా దాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ప్రమాద కారణాలపై హైవే అధికారుల సహకారంతో తగు చర్యలు తీసుకొని ప్రమాదాలు తగ్గించేందుకు చర్యలు తీసుకు ంటున్నట్లు డిఎస్పి వేణుగోపాల్ తెలిపారు.

## గిరిజనుల భూములకు పరిహారం ఇవ్వండి



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** పవర్ గ్రిడ్ కార్పొరేషన్ కోసం సేకరించిన భూము లకు పరిహారం మంజూరు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య ఆరోపించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా యానాది సంక్షేమ సంఘం నేతలతో కలిసి నెల్లూరు ఆర్డీవో ఎన్ఎస్ అనూషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేసీ పెంచలయ్య మాట్లాడుతూ ఏ ఆసరా లేని గిరిజనుల నుంచి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ కోసం మనుబోలు మండలం కాగితాలపూరు, పిడూరు గ్రామాలకు చెందిన గిరిజనుల భూములను 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం సేకరించి పరిహారం అందించకుండా కాలయాపన చేస్తుందన్నారు. అనేక మార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోయామని చెప్పారు. 40 మంది గిరిజనులకు సంబంధించి 60 ఎకరాలను ప్రభుత్వం సేకరించి పరిహారం అందించలేదని తెలిపారు. ఆర్డీవో విచారించి త్వరితగతిన పరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సైదాపురం మండలం చాగణం గిరిజనుల సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎన్ఎస్ అనూష మాట్లాడుతూ మనుబోలు మండలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ లోను ఒక సారి వినతిపత్రం అందజేస్తే విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## సోమిరెడ్డి పై అర్ధరహిత విమర్శలను కాకాణి మానుకోవాలి

**- టిడిపి మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్**



**ముత్తుకూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి పై మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అర్ధరహిత విమర్శలు మానుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ పేర్కొన్నారు. సోమవారం టిడిపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ కాకాని గోవర్ధన్ రెడ్డి నిద్రలేచినప్పటి నుండి ఎమ్మెల్యే సోమిరెడ్డి పైన తనయుడు రాజగోపాల్ రెడ్డి పైన విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. వైయస్సార్ ప్రభుత్వం అన్యాయంగా దోచుకున్నారు తప్ప ప్రజలకు ఏం చేసింది లేదన్నారు. మట్టి గ్రావెలు అన్ని అమ్ముకున్న నాయకుడే మా నాయకుడు పైన విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన సర్వేపల్లిలో నేనెప్పుడూ అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేసే దమ్ము, ధైర్యం ఉందని అన్నారు. నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ ఎక్కువ అందజేసింది ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అనే విషయం వైసిపి నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. ఇకనైనా భాష పదజాలం మానుకొని హుందాగా నడుచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, పైనాపురం సర్పంచ్ విజయ్, ముత్యం గౌడ్, ఎల్లయ్య, పరశురాం, గోనెల సిద్దయ్య, శోభన్, విజయ రమేష్ శర్మ, విష్ణువర్ధన్, రామ్, తదితరులు పాల్గొన్నారు.

## 10న అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవం వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవం వేడుకలు తేదీ 10 డిసెంబర్ 2025న బుధవారం ఉదయం 10:00 గంటల నుండి వెంకటచలం మండలం లోని కంపోజిట్ రీజనల్ సెంటర్ నందు నిర్వహించబడునని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి మొహమ్మద్ అయుబ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అందరూ విభిన్న ప్రతిభవంతులు, సంఘ నాయకులు, ప్రత్యేక పాఠశాల నిర్వహించు స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులతో ఈ కార్యక్రమంలో పాల్గొనగలరని, మే నెల 2023 సమవత్సరం జిల్లాలోని 4 రెవెన్యూ డివిజన్లలో ఆలింకో సంస్థ ద్వారా ఉపకరణములు మంజూరు చేయుటకు నిర్వహించిన క్యాంపులకు సంబందించి పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించబడునని ఆ సమయంలో అర్హులకు ఆలింకో సంస్థ ఇచ్చిన స్లిప్పులను/ఆధార కార్డు జెరాక్స్ కాపీలను తమ వెంట తీసుకురావాలని అయూబ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై తమకు కేటాయించిన ఉపకరణములు పొందగలరని శాఖ సహాయ సంచాలకులు, మహమ్మద్ అయూబ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## దిత్వా తుఫాను నష్టాలకు పరిహారం ఇవ్వాలి



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** మండల ఎమ్మార్వో కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గిరిజనులు, రైతులు కలిసి ధర్నా నిర్వహించారు. దిత్వా తుఫాను ప్రభావంతో గిరిజనులు పనుల్లేక ఇళ్లకే పరిమితమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన సహాయం అందలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడుతూ తుఫాను వెళ్లి 20 రోజులు అయినా ప్రభుత్వం చెప్పిన 1000 సహాయం గిరిజనులకు అందలేదని, ఐదు రోజులు ఆహారం లేక ఇబ్బంది పడ్డ గిరిజన కుటుంబాలను అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. మత్స్యకారులను వేటకు వెళ్ళొద్దని ప్రభుత్వం హెచ్చరించినా, వారికి కూడా నిత్యవసరాలు, ఆర్థిక సాయం అందలేదని అన్నారు. వెంటనే గిరిజన మత్స్యకార కుటుంబాలకు 30 కేజీల బియ్యం, నిత్యవసరాలు మరియు ఒక్కో కుటుంబానికి 5000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు సంఘం మండల కార్యదర్శి చింతా రామసుబ్బయ్య, అధ్యక్షుడు మోచర్ల రాధయ్య మాట్లాడుతూతుఫాను కారణంగా వందల ఎకరాల్లో నారుమడులు మునిగిపోయి నారు కుళ్లిపోయినందున రైతులకు ఉచిత విత్తనాలు ఇవ్వాలని కోరారు. నారు వేతలు, పంట పొలాల్లో జరిగిన నష్టాన్ని అధికారులు పరిశీలించి పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బండి శౌరి, చిన్నబయ, గిరిజన సంఘ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోటి సంతకాల సేకరణకు కాకాణికి ఆహ్వానం కోడూరు వైకాపా నేతలు



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు పంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమంకు మాజీ మంత్రి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొనాలని ఆహ్వానించారు. వైస్ సర్పంచ్ కావాలి రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నేతలు మాజీ మంత్రిని వినయపూర్వకంగా కలిసి కార్యక్రమ వివరాలు తెలియజేశారు. అనంతరం శబరిమల యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన మత్స్యకార నేత పామాంజి దుర్గా మాజీ మంత్రికి అయ్యప్ప ప్రసాదం అందజేశారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్న నేతల్లో కంజి శ్రీరా ములు, ముక్కంటి వీరరాఘయ్య, శేషు, కంజి సురేష్, హరి ప్రసాద్, శంకర్, ఖాదర్ బాషా తదితరులు ఉన్నారు.

## ప్రజలందరికి వైద్య సేవలు అందించడమే లక్ష్యం



**పెనుబర్తి(రావూరు),డిసెంబరు 8ప్రభాతవార్త :** మండలంలోని ప్రజలందరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రాపూరు మండల మైనారిటీ నాయకుడు ఎస్డీ. ఖాజామోహద్దీన్ తెలిపారు. సోమవారం పెనుబర్తి గ్రామ ఉన్నత పాఠశాలలో నెల్లూరు నారాయణా ఆసుపత్రి వారిచే ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నారాయణా ఆసుపత్రికి చెందిన వివిద వ్యాధులకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు వైద్య పరిక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐడిడిపి కోఆర్డినేటర్ రత్నం యాదవ్, చెంచయ్య, సాయి చందు, పలువరు టిడిపి నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆత్మకూరు పోలీస్‌కు జిల్లా ఎస్పీ ప్రశంసలు



**ఆత్మకూరు ,డిసెంబరు8ప్రభాతవార్త:** ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మానం వెంకటేశ్వర్లు విధి నిర్వహణలో వేగవంతంగా ఉత్తమ ప్రతిభ కనపరచినందుకు జిల్లా ఎస్పీ అజిత అభినందనలు తెలిపి ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందించారు. తమ స్టేషన్ సిబ్బందికి ఎస్పీ ద్వారా ప్రశంస లభించడంతో హర్షం వ్యక్తం చేస్తూ సిఐ గంగాధర్, ఎస్ఐలు జిలానీ, సాయిప్రసాద్‌లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## గుండెపోటుతో ఉద్యోగి మృతి

**ఆత్మకూరు ,డిసెంబరు8ప్రభాతవార్త:** ఫిట్స్ కారణంగా ఓ ప్రభుత్వ ఉద్యోగి సోమవారం మృతిచెందాడు. నెల్లూరుపాళెం కు చెందిన షేక్ షఫి(41) దూబగుంట సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా శనివారం రాత్రి ఫిట్స్ వచ్చాయి. వెంటనే చికిత్సకు ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మెరుగైన వద్యం కోసం ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. చికిత్స సమయంలో గుండెపోటు రావడంతో ఆయన మృతిచెందాడని బంధువులు తెలిపారు.

## గృహనిర్మాణాశాఖ పైన సమీక్ష

**బిట్రగుంట డిసెంబర్ 8 ప్రభాతవార్త :** బోగోలు మండలపరిషత్ కార్యాలయం లో సోమవారం గృహనిర్మాణ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇటీవల ప్రధానమంత్రి అవాస్ యోజన క్రింద దరఖాస్తు చేసుకున్నావారివివరాలపై సర్వే త్వరితగతిన పూర్తిచేయాలనీ ఆదేశించారు. ఇంకను అర్హులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలంటే ఈనెల 14 వ తేది చివరిగడువు అని లబ్ధిదారులుకు అవగాహనా కల్పించాలని సూచించారు.

## బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం



**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** బాల్య వివాహాలు చేయడం అనేది ఒక సాంఘిక దురాచారం అని ఐసీడి ఎస్ సీడీపీవో టి. శారద అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో సోమవారం బాలికలకు భేటీ పడావో.. భేటీ బచావో కార్యక్రమంలో భాగంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ 18 సంవత్సరాలు లోపు వివాహం చేసుకోవడం వలన అనేక దుష్పరిణామాలు జరుగుతాయన్నారు. బాల్య వివాహాల వలన పుట్టే బిడ్డకు కూడా ఇబ్బందులు వచ్చే పరిస్థితి వస్తుందన్నారు. బాలికలు తప్పనిసరిగా బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే చదువే ప్రధాన ఆయుధమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బాలికలు తప్పక చదవాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. గోవర్ధన్ నాయుడు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పి. పద్మ, ఆశా కార్యకర్త టి. పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలి



**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాల్లో పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు, మేకలకు ఘోట్ ఫాక్స్ టీకాలు వేస్తున్నారని, ఇందుకు ఆయా మండలాల్లోని పాడి రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ టీకాలు వేసే కార్యక్రమం రెండు మండలాల్లో ప్రారంభం అయిందని డిసెంబర్ 12 వరకు కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించి రెండు మండలాల్లోని అన్ని సచివాలయాలకు పంపడం జరిగిందన్నారు. కోవూరు మండలంలో 8,344 పశువులకు , విడవలూరు మండలంలో 11,392 పశువులకు ఈ గొంతు వ్యాధి నివారణ టీకాలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. అదేవిధంగా కోవూరు మండలంలో 2238 మేకలు, విడవలూరు మండలంలో 2672 మేకలకు ఘోట్ ఫాక్స్ టీకాలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఆయా సచివాలయాల్లో పశు సంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రల ద్వారా టీకాలు వేయడం జరుగుతుందని ఇందుకు వారు సహకరించాలన్నారు.

## విధి నిర్వహణలో అంకితభావం అవసరం



**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** సచివాలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రభుత్వం వారికి కేటాయించిన విధులు , బాధ్యతలను పారదర్శకంగా నిర్వహించాలని జీఎస్‌డబ్ల్యూ డిప్యూటీ ఎంపీడీవో సురేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కోవూరు మండలంలోని సచివాలయం-3ను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగి వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి సచివాలయానికి, మండలానికి పేరు తేవాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

## పాలిటెక్నిక్ విద్యపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలకమని, అనంతరం విద్యార్థులు డిప్లమా కోర్సుల్లో చేరితే మంచి భవిష్యత్తు ఉందని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల అనుబంధ డిప్లమా కళాశాల అధ్యాపకులు ఎస్. వెంకట్, ఎస్‌కే అవేజ్‌లు తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాలలో సోమవారం వారు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో నెల్లూరు జిల్లా పెద్ద పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందే పరిస్థితి ఉందన్నారు. తడలోని శ్రీసిటీ, పెళ్లకూరులోని సెజ్‌లలో ఇప్పటికే అనేక పరిశ్రమలు స్థాపించబడ్డాయన్నారు. రానున్న రోజుల్లో డిప్లమా విద్యార్థులకు భారీ డిమాండ్ ఉంటుందన్నారు. తద్వారా డిప్లమా విద్యార్థులకు చక్కని ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## పీజీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

**వెంకటాచలం డిసెంబర్ 8 ప్రభుత్వవార్తా :** విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని పీజీ స్పాట్ అడ్మిషన్ గడువు ఉ ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు తె విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు ఇంకా భర్తీ కావాల్సిన సీట్లు దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకున్నారు. కాకుటూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ, కావలి, ఎంట్రన్స్ పరీక్ష రాయకపోయినా స్పీట్ పొందే అవకాశం ఉంది. ఆసక్తి గల విద్యార్థులని పనిలో చేతులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## కోనేరుగుంటను ఎండోమెంట్‌లో చేర్చండి సార్



**కొడవలూరు,డిసెంబర్ 8 ప్రభాతవార్త :** కొడవలూరు పంచాయితీ నందు వెలసి ఉన్న కామాక్షితాయి సమేత శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం ఆవరణంలో ఉన్న కోనేరు గుంట ను ఎండిమెంట్‌లో చేర్చాలని ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్యక్రమంలో ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణకు స్థానిక గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ళతర బడి నుంచి కోనేరుగుంట ఎండోమె ంట్‌లో చేర్చకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల మ్మపాలెం సొసైటి డైరెక్టర్ పి.శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు ఎస్‌కె.బాషీ, హితేంద్ర సాగర్, నవాజ్, మన్నె సుకుమార్, ఆలయ అర్చకులు నాగరాజుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలతో పెన్షన్లు నమోదు



**కొడవలూరు,డిసెంబర్ 8 ప్రభాతవార్త :** మండలంలోని పెన్షన్లకు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని స్థానిక ఎంపిడిఓ వెంకట సుబ్బారావు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్య క్రమంలో పెన్షన్ల కోసం 9అర్జీలు రావడం జరిగిందన్నారు. పంచాయతీ గ్రామాల్లో వివిధ కార్యక్రమాలకు హాజరు కావడంతో అక్కడ కూడా మరికొంతమంది నూతన పెన్షన్లను కావాలని కోరడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి ఆన్‌లైన్‌లో ప్రక్రియ విడుదలయితే పెన్షన్లు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయ పంటలే ఆరోగ్యం



**కొడవలూరు,డిసెంబర్ 8 ప్రభాతవార్త :** ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని స్తానిక తహశీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం తహశీల్దార్ కారాయలయంలో ప్రకృతి ఆకుకూరల స్టాల్స్‌ను ఏర్పాట చేసి రైతుల వద్దనుంచి నేరుగా వినియోగదారులకు అమ్మకాలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్స్ నుంచి కొన్ని కూరగాయలను విక్రయించారు. దీంతో ప్రకృతిపరంగా పండించే పంటలను తింటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ గాయత్రి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగభూషనమ్మ, జి.కవితారాణి, ఐసిఆర్‌పిలు పి.అనూష, షేక్ ఖాసీంబి, కె.శ్రాణి, వి.అర్చన తదిరులు పాల్గొన్నారు.

## డిప్యూటి ఎంపిడిఓకు ఘన సన్మానం



**కొడవలూరు,డిసెంబర్ 8 ప్రభాతవార్త :** మండల జిఎస్‌డబ్ల్యుఎస్ డిప్యూటి ఎంపిడిఓగా శ్యామ్‌సుందర్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. మండల సచివాలయ సిబ్బంది సోమవారం ఎంపిడిఓ కార్యాలయంకు చేరు కొని ఎంపిడిఓ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో డిప్యూటి ఎంపిడిఓను మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఇదే మండలం నార్త్ రాజుపాలెం పంచాయితీలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ గ్రేడ్-1 నుంచి పదోన్నతిపై డిప్యూటి ఎంపిడిఓగా రావడం సంతోషకమైన విషయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామ్‌ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సాదాబైనామ జీఓపై విఆర్‌ఓలతో సమీక్ష



**కొడవలూరు,డిసెంబర్ 8 ప్రభాతవార్త :** స్థానిక మండల కేంద్రంలో సోమవారం ప్రజల సమస్యల ప్రజావేధిక పరిష్కార కార్యక్రమంపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. కొంతమంది రైతులు భూమి విస్తరణ సర్వేకు సంబంధించి అర్జీలు సమర్పించారు. సాదాబైనమా జీఓకు సంబంధించి విఆర్‌ఓలతో తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాదాబైనామా ఈనెల 4నుంచి జిఓ రావడం జరిగిందని ప్రతి విఆర్‌ఓ ఆన్‌లైన్‌లో ఓపెన్ అయిన తరువాత అప్లికేషన్‌లో ఎంతమంది ఉన్నారో గుర్తించాలని వివరించారు. వచ్చిన అర్జీలను పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ సారంగపాణి, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌బాబు, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## తుఫాను నష్టాలతో అతలాకుతలమైన రైతుల పరిస్థితి కూటమి ప్రభుత్వం



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** సర్వేపల్లి నియోజకవర్గంలో తుఫాను వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జలమయం అయిన ప్రాంతాలను, దెబ్బతిన్న నారుమళ్లను, పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా గాలికి వదిలేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. వరదలకు నష్టపోయిన వారికి సబ్సిడీ విత్తనాలు, పంట భీమా, ఎరువులు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. యూరియా కార్డుల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వం, కనీసం వర్షాలకు దెబ్బతిన్న నారుమళ్లకు కూడా సహాయం చేసే పరిస్థితిలో లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయం, ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంటి ముంగిట అందించగా, చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటాలు తప్ప ఏ హామీని నిలబెట్టుకోలేదని ఆయన విమర్శించారు. సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతి తప్ప ప్రజల కోసం ఏం చేయలేదని, నియోజకవర్గ ప్రజలు అతన్ని పూర్తిగా విస్మరించారని వ్యాఖ్యానించారు. దిత్వా తుఫాను ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం వెంటనే సబ్సిడీ విత్తనాలు అందించి, నష్టాన్ని అంచనా వేసి, అన్ని బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఇనమడుగు ధర్మయ్య అరగాల రమణయ్య కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు సుధీర్ రెడ్డి, ఉప్పల శంకరయ్య గౌడ్, తలమంచి సురేంద్రబాబు. తిరువల్లూరు ఈశ్వరయ్య, టంగటూరు పద్మనాభ రెడ్డి, ఇసనాక రమేష్ రెడ్డి, వేముల శ్రీనివాసులు, ఉదయ్ కుమార్ రెడ్డి, మన్యం సుబ్రహ్మణ్యం గౌడ్, ఆకుల మధుసూదన్ గౌడ్, చిరంజీవి గౌడ్, మండల వైకాపా నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిప్యూటి సిఎంని కలిసేందుకు జనసేననేతలు



**కలువాయి డిసెంబర్ 8 ప్రభాతవార్త :** కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలో ఉంచాలన్న ప్రతిపాదనను డిప్యూటి సిఎం పవపన్ కళ్యాణ్ వద్ద ఉంచేందుకు కలువాయి జనసేన నాయకులు మండల పార్టీ అధ్యక్షులు పెరంకొండ మనోహర్, వీరమహిళ ప్రవల్లిక, నరేష్, సుంకు రామ కిషోర్, హరిప్రసాద్ , శ్రీహరి తోపాటు మండలంలోని జనసైనికులు మంగళగిరికి తరలివెళ్లారు.డిప్యూటి సిఎంకి కలువాయి ప్రజల గుంతుకను వినిపించనున్నట్లు వారు తెలియజేశారు.

## పోశింరెడ్డి బ్రదర్స్‌ని పరామర్శించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి డిసెంబర్ 8 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం వైసిపి రైతు విభాగం అధ్యక్షులు పోశింరెడ్డి శ్రీనివాసు లురెడ్డి ,వైసిపి సీనియర్ నాయకులు వెంకురెడ్డి ని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రేబాల గ్రామంలో పరామర్శించారు.ఇటీవల వారి సోదరి వెంకటసుబ్బమ్మ ఇటీవల అనారోగ్యంతోమృతి చెందడంతో రేబాల గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.ఈకార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, సీనియర్‌నాయకులు కోడూరు నిరంజన్‌రెడ్డి, బోగోలు దయాకర్‌రెడ్డి, పోతిరెడ్డి నాగసుబ్బారెడ్డి, ముమ్మిడి క్రిష్ణారెడ్డి, పిల్లిమెట్ల శ్రీహరి, వల్లూరు అశోక్‌రెడ్డి, గంపల అంకయ్య, స్దానిక నాయకులున్నారు.

## ఎంఈఓలను కలిసిన యూటీఎఫ్ నూతన కార్యవర్గం



**ఉదయగిరి, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరి నందు జరిగిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉదయగిరి మండల సమావేశం నందు ఉదయగిరి మండల శాఖ అధ్యక్షులు ఆరవ సురేష్ ప్రధాన కార్యదర్శి షేక్ హనీఫ్ కార్యవర్గ సభ్యులు సోమవారం ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారులైన టి.వెంకటేశ్వర్లుని ఎంఈఓ-2 టి.శ్రీనివాసులుని మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారులు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు , కార్యవర్గసభ్యులకు అభినందనలు తెలియజేశారు. యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు యుటీఎఫ్ లగేజ్ బ్యాగులను మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. తదుపరి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, నూతన కార్యవర్గ సభ్యులు మండల విద్యాశాఖ అధికారులతో సమావేశమై ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ కంబాల చంద్రశేఖర్‌రెడ్డి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేటాయించిన ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకోవాలి



**కోవూరు, డిసెంబరు8 ప్రభాత వార్త :** కోవూరులోని చెరువు కట్ట సమీపంలో నివాసం ఉంటున్న 59 కుటుంబాలకు గానూ 39 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని, వారంతా వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్లు కట్టుకోవాలని కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య సూచించారు. ఈ మేరకు పట్టాలు పొందిన వారు సోమవారం గ్రీవెన్స్‌డే లో తహసీల్దార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చెరువు కట్టను రూ. 10 లక్షల వ్యయంతో పటిష్ట పరుస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు సాధ్యమైనంత త్వరలో వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకోవాలని సూచించారు. ఇళ్ల స్థలాలు లేని వారికి కూడా కోవూరు ఎమ్మెల్యే సూచనలు , ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఇళ్ల పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ దిలీప్‌కుమార్‌లు ఉన్నారు.

## సెప్టిక్ ట్యాంక్ ద్వారా డ్రైనేజీ నీళ్లు తొలగింపు

**వార్త కథనానికి స్పందన**




**బిట్రగుంట డిసెంబర్ 8 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి అన్నదాన సత్రం ముందర డ్రైనేజీ వాటర్ నిండిపోయి వీధుల్లో ప్రవహిస్తూ దుర్గంధం ఎదజల్లుతున్నాదని ఇటీవల వార్త దినపత్రికలో ప్రచురితమైన వార్తకు ఆలయ కార్య నిర్వహణ అధికారి అరవ రాధాకృష్ణ స్పందించారు నిండిపోయిన డ్రైనేజీని సోమవారం సెప్టిక్ వాటర్ ట్యాంక్ ద్వారా బయటకు తరలించారు.

## నేడు పెన్షనర్లకు క్రీడాపోటీలు

**కావలి, డిసెంబర్8 ప్రభాతవార్త :** కావలి తాలూకా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురష్కరించుకొని పెన్షనర్లకు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని పెన్సనర్ల సంఘం అధ్యక్షులు ఆకుల రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీలు పట్టణంలోని ఉదయగిరి రోడ్డు వద్ద పోలీస్ పెట్రోల్‌బంకు పక్కన మినీస్టేడియంలో ఉదయం 9 గంటలకు నిర్వహించబడుతాయని తెలిపారు. కావున ప్రతి పెన్షనర్లందరూ ఈ క్రీడా పోటీల్లో పాల్గొనా ల్సిందిగా ఆయన కోరారు.

## సముద్ర తీర భద్రతపై అవగాహన



**కావలి, డిసెంబర్8 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం పల్లిపాలెం గ్రామం నందు సో మవారం ఇసుకపల్లి ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ వి.శేషయ్య ఆధ్వర్యంలో కమ్యూనిటి ఆవెర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించి సముద్ర తీర భద్రతపై పలు విషయాలను చర్చించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విశాఖపట్టణం డిఐజి గోపినాథ్ ఉత్తర్వుల మేరకు, ఏఎస్‌పి జిబిఆర్ మదుసూదనరావు ఆదేశాల మేరకు డిప్యూటి సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సౌత్ కోస్టల్ సెక్యూరిటి పోలీస్ బాలిరెడ్డి పర్యవేక్షణలో ఇసుకపల్లె కోస్టల్ కమ్యూనిటి పోలీస్ స్టేషన్ పరిధిలో చెన్నపాలెం పల్లిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జానకి రామిరెడ్డి, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, విఆర్‌ఓ, మల్లికార్జున, సాగర్‌మిత్ర, అరుణ, క్రిష్ణవేణి, గ్రామ కాపు నాగేశ్వరరావు, సర్పంచ్ హరిక్రిష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

## ఏపీ మదరసా అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి పత్రం

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ తిక్కన ప్రాంగణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మదరసా అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 175 మదరసా విద్యార్థులకు ఉర్దూ అరబ్బీతో పాటు మోడర్న్ ఎడ్యుకేషన్ కొరకు 525 విధ్యా వాలంటీర్లు ఉండే వారు ప్రస్తుతం లేరని. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ లిఖిత పూర్వకంగా విద్యాశాఖ మంత్రికి లెటర్ రాసినారని అయినా ఇప్పుడు దాకా ఎలాంటి చర్యలు తీసుకోలేదుని, ముస్లిం పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం మంచి విధ్య అందించాలని వారి భవిష్యత్తు కోసం త్వరగా చర్యలు తీసుకోవాలని విధ్యా వాలంటీర్లు నియమించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొనే విధగా ప్రయత్నిస్తాము అని చెప్పడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాకీరా, రేహానా, మహమ్మద్ జియా ఉల్ హక్, జిలానీ, సుబహాన్, మహబూబ్ భాష, మునీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలపెంట సముద్రం గుంతలు తనిఖీ



**కావలి, డిసెంబర్8 ప్రభాతవార్త :** దిత్వా తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని తుమ్మలపెంట బీచ్ సముద్రం ఒడ్డున ఏర్పడిన గుంతలను సోమవారం ఇసుక పల్లె మెరైన్ సిఐ వి.శేషయ్య, ఎస్ఐ జానకి రామిరెడ్డి, సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లా డుతూ విశాఖపట్టణం రేంజ్ డిఐజి గోపినాథ్ ఉత్తర్వుల మేరకు సౌత్‌కోస్టల్ సెక్యూరిటి పోలీస్ బాలిరెడ్డి పర్యవేక్షణలో గ్రామ సర్పంచ్, కాపులు, పెద్దల సమక్షంలో గజ ఈతగాళ్లతో కలసి దిత్వా తుఫాన్‌తో దెబ్బతిని గుంతల మయంగా మారిని బీచ్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ గుంతలతో జరిగే ప్రమాదాల గురించి సందర్శకులకు, ప్రజలకు సేచనలు, సలహాలు ఇచ్చారు.

## పెండింగ్‌లో ఉన్న టైటిల్ వివాదాలను జిల్లా కోర్టు లేదా హైకోర్టులో పరిష్కరించుకోవాలి



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** టైటిల్ వివాదాలను నిర్ణయించే అధికారం రెవెన్యూ కోర్టుకు లేదని, ప్రజలు పెండింగ్‌లో ఉన్న టైటిల్ వివాదాలను జిల్లా కోర్టు లేదా హైకోర్టులో పరిష్కరించుకోవాలని నెల్లూరు ఆర్డీవో ఎన్ఎస్ అనూష సూచించారు. నెల్లూరులోని తన ఛాంబర్లో సోమవారం ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో భాగంగా తనకు 13 ఫిర్యాదులు అందాయని, అందులో 8 పట్టా భూమి అంతర్గత కోర్టు వివాదాలకు సంబంధించినవి అని తెలిపారు. అంతే కాకుండా సీనియర్ సిటిజన్‌ల పిటిషన్లు కూడా తనకు అందుతున్నాయని తెలిపారు. తాను తన దృష్టికి వచ్చే వివిధ కేసులకు సంబంధించి వేగంగా పరిష్కారం చూపడంతో ఎటువంటి ఫిర్యాదులు పునరావృతం కావడం లేదని వివరించారు. బుధవారం నాటికి తనకు అందిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బుధవారం మనుబోలులో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై వినతులు అందజేయాలని కోరారు.

## నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సఖి సురక్ష స్క్రీనింగ్ పరీక్షలు



**నెల్లూరు సిటీ, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్, అర్బన్ హెల్త్ సెంటర్ సోమవారం ఉదయం 8.30 గంటలకు క్యాంప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల ఆరోగ్యం బాగుండాలి అని థైరాయిడ్, షుగర్ ,విటమిన్ లోపం, సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, మెనిటియల్ హైజనిక్ క్యాన్సర్, ఎనీమియా, ప్రోటీన్ లోపం, మెంటల్ ఇల్నెస్ కౌన్సిలింగ్ వంటి 16 రకాల టెస్ట్‌లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ మెప్మా, బి లీలారాణి మాట్లాడుతూ మిషన్ డైరెక్టర్, మెప్మా వారి ఆదేశాల ప్రకారం సఖి సురక్ష స్క్రీనింగ్ టెస్ట్‌లు క్యాంప్‌లుగా పెట్టి నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంప్‌లు నాలుగు రోజుల పాటు నెల్లూరు నగరంలో చేస్తారన్నారు. 10,000 వేల రూపాయల విలువ చేసే పరీక్షలు చేస్తున్నారు. ప్రతి స్లమ్స్‌లో ఉన్న స్వయం సహాయక సభ్యులు ఉపయోగించుకోవాలి అని చెప్పారు. 5 లక్షల ఆరోగ్య బీమా విలువ గల ఆయుష్మాన్ భారత్ కార్డ్ ఇస్తారు దీని ద్వారా నెట్వర్క్ హాస్పిటల్ లలో అడ్మిట్ అయ్యి చూపించు కోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా హెల్త్ న్యూట్రిషన్ బి.కాంతయ్య, సీఎంఎం జరీనా, సిఓలు కామాక్షయ్య, ఝాన్సీ, శైలజ, సురేష్, ఆర్పిలు, హెచ్‌ఆర్‌పిలు పాల్గొన్నారు.

## బాప్టిస్ట్ క్రిస్టియన్ ఆస్తులను కాపాడండి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** సిఏఎం, ఏబిఎం, బీసీ హాస్పిటల్ స్థలాలను పరిరక్షించండి అంటూ నెల్లూరులో ఉన్న క్రిస్టి యన్ స్కూల్స్‌ను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని నెల్లూరు బాప్టిస్ట్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ ఫోరం సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎన్‌బిపిపి ఫోరం ఛైర్మన్ కోలా రూబెన్ మాట్లాడుతూ బాప్టిస్ట్ క్రైస్తవ ఆస్తులను క్రయవి క్రయాలు జరిపేందుకు ఎవరికీ ఏ సంస్థకు అధికారాలు లేవని మద్రాస్ హైకోర్టు 124/94 ద్వారా సంచలనాత్మక తీర్పు ఇచ్చిందని తెలిపారు. అడ్వకేట్ లోకనాథం మాట్లాడుతూ కోర్టు తీర్పు ప్రకాంము సిఏఎం ఏబీ ఎంబీసీ హాస్పిటల్ ఆస్తులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. అలనాడు మిషనరీలు అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని విద్య వైద్య సదుపాయాలు ఉచితంగా అందించాలనే సర్వోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేస్తే ఇప్పుడు కొందరు అన్యాయంగా అక్రమంగా వాటిని క్రయ విక్రయాలు చేస్తున్నారని, ఎవరైనా అలా చేస్తే అవి చెల్లవని తెలిపారు, 42వ వార్డు ఇన్చార్జ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ సిఏఎం స్కూల్ వలన అనేక ముస్లిం మైనారిటీలు విద్యను అభ్యసించారని, మరలా ప్రభుత్వం జోక్యం చేసుకొని స్కూల్‌ను పునరుద్ధరించాలని, స్కూలు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కలెక్టర్ కోరినట్లు తెలిపారు. అడ్వకేట్ సుధీర్ మాట్లాడుతూ డ్రగ్స్ లాంటి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా సిఏఎం స్కూల్ తయారైందని ప్రభుత్వం జోక్యం చేసుకొని వందల సంవత్సరాల చరిత్ర గల ఆస్తులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్ నాయకులు ఆశీర్వాదం, అజయ్ భాస్కర్, సక్సేనా, అడ్వకేట్ సుధీర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మదరసా అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి పత్రం

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ తిక్కన ప్రాంగణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మదరసా అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 175 మదరసా విద్యార్థులకు ఉర్దూ అరబ్బీతో పాటు మోడర్న్ ఎడ్యుకేషన్ కొరకు 525 విధ్యా వాలంటీర్లు ఉండే వారు ప్రస్తుతం లేరని. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ లిఖిత పూర్వకంగా విద్యాశాఖ మంత్రికి లెటర్ రాసినారని అయినా ఇప్పుడు దాకా ఎలాంటి చర్యలు తీసుకోలేదుని, ముస్లిం పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం మంచి విధ్య అందించాలని వారి భవిష్యత్తు కోసం త్వరగా చర్యలు తీసుకోవాలని విధ్యా వాలంటీర్లు నియమించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొనే విధగా ప్రయత్నిస్తాము అని చెప్పడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాకీరా, రేహానా, మహమ్మద్ జియా ఉల్ హక్, జిలానీ, సుబహాన్, మహబూబ్ భాష, మునీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలు వెక్కిరించే వారిపై కఠిన చర్యలు చేపట్టండి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** గంజాయి, మత్తు మందుల విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కేసి పెంచలయ్య సోమవా తన అనుచరులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన్ భవన్‌లో జరిగిన ప్రజా విజ్ఞప్తులు దినంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిపిఎం కార్యకర్త, ప్రజా కళాకారుడు, ప్రజానాట్యమండలి నెల్లూరు రూరల్ డివిజన్ కార్యదర్శి కె పెంచలయ్య నెల్లూరు నగరంలోని ఆర్‌డిటి కాలనీలో గంజాయి, మత్తుమందులకు వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఇది ఓర్వలేని అరవ కామాక్షి గంజాయి మత్తుమందుల ముఠా పెంచలయ్యను దారుణంగా హత్యగావించింది. పెంచలయ్యకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. పెంచలయ్య కుటుంబానికి 50 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని భూమి, నివాస స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని పెంచలయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పెంచలయ్య కుటుంబానికి రక్షణ కల్పించాలని, పెంచలయ్యను హత్య చేసిన ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని పెంచలయ్య దళిత కుటుంబానికి చెందినవారైనందున ముద్దాయిలు ఇతర కులాలకు చెందినవారు ఉన్నందు ఎస్సీ,ఎస్టీ యాక్ట వర్తింప చేయాలని, ప్రభుత్వ పరంగా వచ్చే అన్ని రాయితీలు వచ్చేందుకు చర్యలు చేపట్టాలి. గంజాయి, మత్తు మందుల ముఠాలను గికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని, కళాశాలలు, మత్తు మందులు వినియోగిస్తున్న ప్రాంతాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. గంజాయి, మత్తు మందుల బారి నుండి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపట్టవలసిందిగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉష, పలువురు కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై పనిచేస్తున్న కార్మికులకు అవగాహన



**కావలి, డిసెంబర్8 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం గారవరం వద్ద జాతీయ రహదారిపై పనిచేస్తున్న కార్మికులకు మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గత నాలుగురోజుల క్రిత న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్ పాల్గొని మాట్లాడారు. జాతీయ రహదారిపై పనిచేసే కార్మికులు ఇరువైపులా వచ్చే వాహనాలను గమనిస్తూ కోన్స్ పెట్టేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాలను గమనిస్తూ హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసుకొని పై అధికారులు చెప్పిన విధంగా తగిన సూచనలు సలహాలతో కార్మికుల పనులు చేపట్టాలని సూచించారు. ప్రమాదాల జరిగినపుడు ఎవరికైనా న్యాయం కావాలంటే మండల సేవాధికార సంస్థచే ఉచిత న్యాయ సాయం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ సేఫ్టి అధికారి గిరి, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండరెడ్డి, ఫారెస్టు గార్డు శ్రీనివాసరావు, పిఎల్‌పిసి హెచ్ అశోక్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చొరువ చూపాలి



**వింజమూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త** వింజమూరు మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరువ చూపాలని సొసైటీ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ కోరారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ఆయన తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.హమీద్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మండలం నుండి ఎంతో మంది ప్రజలు పలు సమస్యలపై కార్యాలయానికి వస్తుంటారని వారి సమస్యలను తీర్చకుండా కాలయాపన చేసినట్లయితే వారు ఎంతో వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తుందని ఆయన అన్నారు. ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగలేక ఓపిక నశించి జిల్లా కార్యాలయాలకు వెళ్లే పరిస్థితి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ పరిస్థితిని ఇక్కడే పరిష్కరిస్తే సమస్యలు ఉండవు అని ఆయన తెలిపారు. కావున గ్రీవెన్స్‌లో వచ్చే పలు అర్జీలను పరిశీలించి వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కేఎస్ నాయుడు, మహబూబ్ భాషా, మునిరత్నం తదితరులు ఉన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని నిరసన



**వింజమూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త** సహకార సంఘాల కార్యాలయాలలో పని చేస్తున్న సిబ్బందికి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సెంట్రల్ బ్యాంకు ఎదురుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర సహకార సంఘాల జేఏసీ ఆదేశాల మేరకు వింజ మూరు గరిమినపెంట కుదుముల, దిన్నెపాడు, కలిగిరి, వింజమూరు సొసైటీలకు సంబంధించిన సీఈఓలు సిబ్బంది ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్భంగా వారు జీవో నెంబరు 36ను వెంటనే అమలు చేయాలని 2019 24 సంవత్సరాలలో పెండింగ్లో ఉన్న వేతన సవరణలు చట్టాలను సరి చేయాలని, గ్రాడ్యూటీ చట్టాన్ని అమలు చేసి ఆ చట్ట ప్రకారం గ్రాడ్యూటీని ఇవ్వాలని సహకార సంఘాల ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు చేయాలని సహకార సంఘాల్లో పని చేసే ఉద్యోగులకు ప్రమాద భీమా ఐదు లక్షలు కల్పించాలని, అదే విధంగా ప్రతి ఉద్యోగికి టర్మ్ ఇన్సూరెన్స్ 20 లక్షల పాలసీని చేయాలని దీని వల్ల ఉద్యోగ చనిపోయినట్లయితే ఆ కుటుంబానికి ఆధారం దొరుకుంతుందన్నారు. అలాగే 2019 తర్వాత సంఘంలో చేరిన ఉద్యోగికి వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ క్లర్కులను లేదా కంప్యూటర్ ఆపరేటర్లను సీనియారిటీ ప్రకారం జిల్లాలో ఖాళీగా ఉన్న సీఈఓ పోస్టులను వీరితో భర్తీ చేయాలన్నారు. తదితర డిమాండ్ల సాధనకై చేస్తున్న నిరసన కార్యక్రమంను సెంట్రల్ బ్యాంక్ సిబ్బందికూడా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వింజమూరు బ్యాంక్ చీఫ్ మేనేజర్ సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, మేనేజర్ పి.నళిని, అసిస్టెంట్ మేనేజర్ హరీష్ నగదు అధికారి మనోజ్ సీఈఓ మేకల రమణయ్య, కొండాపురం, కలిగిరి, సిద్దనకొండూరు సొసైటీల సీఈఓలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమణ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కావలికి పట్టణానికి చెందిన శోభనాల సాయి సుస్మిత, తండ్రి శోభనాల కృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. తన స్థలానికి ఎదుట కొంతమంది స్థలాన్ని ఆక్రమించి చిన్న చికెన్ దుకాణం పెట్టారని తీసేయమని షాప్ పెట్టిన వాళ్లను అడిగితే మేము దళితులం, పేదవాళ్ళం. మేము ఎక్కడైనా పెట్టుకునే హక్కు ఉందిని మరోసారి షాప్ తీయమని అడిగితే మీరు మమ్మల్ని కులం పేరుతో తిట్టారని కేసు పెడతాం అని బెదిరిస్తున్నారని కలెక్టర్ కి తెలిపారు. కావలి పోలీస్ అధికారులకు, ఆర్‌అండ్‌బి వారికి, మున్సిపల్ కమిషనర్‌కి సమస్య పై అర్జీలు పెట్టాము. కాని ఫలితం లేదని తెలిపారు దస్తవేజు నెంబర్ 344/2011 రిజిస్టర్ కాబడిన 66 అంకణములలో శోభనాల సాయి సుస్మిత ఐన తనకు 30 అంకణాలు పోను భర్త ఐన శ్రీహర్ష పేరుతో 36 అంకణములు కొనుక్కున్నామని, రికార్డ్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వ సమస్త బిఎస్‌ఎన్‌ఎల్ వారు రూమ్ కట్టుకోవటానికి స్థలం అడిగితే ఆమె వీళ్లకు కట్టుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఆనితెలిపారు. ఆక్రమానికి గురైన వారిపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని, కలెక్టర్‌కు విన్నపించుకున్నారు.

## పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ



**కావలి, డిసెంబర్8 ప్రభాతవార్త :** కావలి జవహర్ భారతి కళావాల ఉద్యోగి, సంయుక్త సేవా సంస్థ సభ్యులు రామ్మూర్తి, మహేశ్వరీ దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పరిసర ప్రాంతాలైన బుడంగుంట గిరిజన కాలనీల్లో పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ వివాహ దినోత్సవం సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించినట్లు పేర్కొన్నారు. మా సంస్థచే అనేక సేవా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో రామ్మూర్తి, మహేశ్వరీ దపంతులు పాల్గొని పలువురిచే ఆశీర్వాదాలు పొందారు.

## బీసీలపై తప్పుడు ప్రచారం డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న టీడీపీ



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ, వైఫల్యాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధారాలతో ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేని టీడీపీ నేతలు బీసీలను అవమానించాడనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకట శేషయ్య అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడిన ఆయన, జగన్ మాటలను వక్రీకరించడం తప్పుదారి పట్టించే రాజకీయమని విమర్శించారు. యాపులపై జగన్ ఎలాంటి అవమానకర వ్యాఖ్యలు చేయలేదని, అయితే చంద్రబాబు గతంలో రజకులు, నాయిబ్రాహ్మణులపై చేసిన వ్యాఖ్యలు, జగన్‌పై 'సైకో, నరికేస్తా' వంటి మాటలు టీడీపీ నాయకులు మరచిపోయారా అని ప్రశ్నించారు. బీసీలకు రాజ్యసభ, ఎమ్మెల్సీ అవకాశాలు ఇచ్చింది కేవలం జగన్ ప్రభుత్వమని, యాదవులకు విశాఖ, తిరుపతిలో మేయర్ పదవులు ఇచ్చి గౌరవం కల్పించినప్పటికి కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళా మేయర్‌లను అవమానకరంగా తొలగించిందని చెప్పారు. తిరుమల లడ్డు కల్తీ నుంచి నకిలీ లిక్కర్, భూదోపిడి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వరకు జగన్ ఉంచిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వలేక సోషల్ మీడియాలో దారి తప్పించే ప్రచారమే చేస్తోందని శేషయ్య విమర్శించారు. యాపుల వంశపారంపర్య హక్కులు, తిఉమల గోల్ల మండపంపై నిర్ణయాలు సైతం జగన్ హయాంలోనే సానుకూలంగా అమలయ్యాయని గుర్తు చేశాఉ. బీసీలను నిజంగా గౌరవించి పదవులు, ప్రాతినిద్యం కల్పించిన నాయకుడు జగన్ మాత్రమేనని, టీడీపీ నుంచి వచ్చిన ఆరోపణలను ప్రజలు నమ్మరని మండల వెంకట శేషయ్య స్పష్టం చేశారు.

## బంగారు కుటుంబాలకు రెడ్‌క్రాస్ భరోసా



**కావలి, డిసెంబర్8 ప్రభాతవార్త :** రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 42 గిరిజన కుటుంబాలకు పి-4 పథకం కింద దత్తత తీసుకొని భరోసా కల్పించడం జరుగుతుందని రెడ్‌క్రాస్ అధ్యక్షులు, ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ భవనంలో సోమవారం ఆర్డీఓ మాట్లాడుతూ పట్టణ శివార్లలోని చెరువు కటట గిరిజన సంఘంలో స్థానిక వార్డు సచివాలయ సిబ్బందితో కలసి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్ బృందం సర్వేచేసి 42కుటుంబాలను గుర్తించిందన్నారు. అందులో పది కుటుంబాలకు యువతకు కుట్టుమిషన్ల శిక్షణ, ఇతర నైపుణ్యశిక్షణ ఇచ్చిఉపాధి కల్పిస్తామని మిగిలిన కుటుంబాల్లోని విద్యార్థులకు విద్యాపరమైన శిక్షణ పాఠశాలలకు వెళ్లేందుకు సైకిళ్ళను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదుగురి వృద్ద మహిళలకు రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం మనోహర్ బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు బెజవాడ రవికుమార; ఛైర్మెన్ రవిప్రకాష్, వైస్‌ఛైర్మెన్ కె.హరి నారపరెడ్డి, జిల్లా పాలక మండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరినాథ్‌లు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ సహకార ఉద్యోగుల ధర్నా



**కోవూరు డిసెంబర్ 8 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక సూచన మేరకు సర్కార్ రంగంలో పనిచేస్తున్న ఉద్యో గులు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా కార్యక్రమాన్ని సోమవారం కోవూరులోని సహకార బ్యాంకు ఎదుట చేపట్టారు ఈ సందర్భంగా పలువురు యూని యన్ నేతలు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి సహకారంలో పనిచేస్తున్న ఉద్యోగు లను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రిటైర్మెంట్ వయసు 62 చేయాలన్నారు జీవో నెంబర్ 36ను అమలు చేసి పెండింగ్లో ఉన్న వేతన సవరణ చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు సహకార సంఘాల ద్వారా కాకుండా డిసిసిబిల ద్వారా రైతులకు రుణాలు నేరుగా ఇస్తున్నారని దానిని మార్చి సహకార సంఘాల ద్వారానే రైతు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు సంఘాలు చెల్లించిన షేరు ధనం పై ఆరు శాతం డివిడెంట్ గాని ఆరు శాతం వడ్డీ కానీ చెల్లించాలన్నారు 2019 తర్వాత సహకార శాఖలో ఉద్యోగులుగా చేరిన వారిని పర్మినెంట్ చేయాలన్నారు సహకార శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆరోగ్య బీమా ఐదు లక్షల తక్కువ కాకుండా బీమా చేయించాలి ప్రతి ఉద్యోగికి 20 లక్షల ఇన్సూరెన్స్ చేయించి ఆ కుటుంబాలకు భరోసా కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు సర్కార్ సకల పని చేస్తున్న ఉద్యోగులు చేస్తున్న ధర్నాకు పడుగుపాడు సహకార సొసైటీ ఛైర్మన్ శ్యామ్ సుందర్ రెడ్డి తమ మద్దతు పలికారు ఈ కార్యక్రమంలో సహకార శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు

## అంతర్‌కళాశాలల పోటీల్లో వైకేఆర్‌అండ్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ



**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** కోవూరు మండలం నేతాజీ నగర్‌లో ఉన్న వైకేఆర్‌అండ్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్. లతీఫ్ కుమార్ కావలి జేబీఆర్ కళాశాలలో జరిగిన విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ అంతర్ కళాశాలల పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి తమ కళాశాల పేరు ప్రతిష్టతలను మరింత ఇనుమడింపజేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్ కళాశాలల పోటీ అథ్లెటిక్స విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం, 200, 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలు సాధించాడు. ఇందుకు ఆ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె. రామాంజనేయులు, ఎం. మధుసూదన్‌రావు, తదితరులు ఉన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**వింజమూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త** వింజమూరు మండల పరిధిలోని శంఖవరం పంచాయతీలో ఉన్న వెంకటాద్రిపురం గ్రామంలో బోరు చెడిపోయి ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడడంతో సమాచారం తెలుసుకున్న శంఖవరం సర్పంచ్ భోగిరెడ్డి మల్లేశ్వరి పంచాయతీ నిధులతో నూతన మోటార్ ఏర్పాటు చేశారు. పంచాయతీలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకుని వస్తే సమస్యలు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, లేట్ జయన్న, ఆనంద్, భూమిరెడ్డి భక్తవత్సలా రెడ్డి, భోగిరెడ్డి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో నలుగురికి కారుణ్య నియామకాలు



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నలుగురికి రెవిన్యూ శాఖలో కారుణ్య నియామక పత్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎన్ విజయ్ కుమార్, ఏవో టి విజయ్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయి

**- వైసిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తే సహించేది లేదు- ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలో శాంతి భద్రతలు కాపా డాలని కోరుతూ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి రూరల్ ఇంచార్జ్ ఆనంవిజ యకుమార్ రెడ్డి తదితరులతో కూడిన బృందం సోమవారం జిల్లా ఎస్పీ అజిత వేజండ్లని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పర్వ త రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వైసీపీ నగర అధ్యక్షులడు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ పై అన్యాయంగా పెట్టిన రౌడీ షీట్‌ను ఎత్తివేయాలని కోరారు. నగరంలో పట్టపగలే అల్లరి మూకలు హత్యలకు తెగబడు తున్నా రని, చిన్న చిన్న కారణాలతో క్షణికావేశంలో హత్యలు చేస్తు, ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. నగరం ప్రశాంతంగా మారాలని అందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి సహకరిస్తుందని ఎస్పీకి తెలియజేశామన్నారు. డ్రగ్ తీసుకుంటూ హత్యలకు తెగబ డుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించ కుండా కేసులు నమోదు చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. కక్షపూరితంగా ప్రతిపక్ష పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యట నకు వచ్చినప్పుడు ఆయన్ను చూడాలన్న ఆకాంక్షతో ముందుకొచ్చిన బొబ్బల శ్రీనివాస్ యాదవ్ పై పోలీసులు 307 కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇలా రాజకీయంగా పెడుతున్న అక్రమ కేసులు మూలంగా రౌడీషీట్లు ఓపెన్ చేయడం సరికాదన్నారు. అకారణంగా రౌడీ షీట్ ఓపెన్ చేయడం ఎంతో దారు ణమని, ఆ కుటుంబాన్ని మనోవేదనకు, గురి చేయడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ గారిని కలిసి వివరించడం జరిగిందన్నారు. ఎస్పీ ఈ అంశంపై క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారని అన్నా రు. జరుగుతున్న అరాచకాలను తమ పార్టీ ఎన్నడూ ప్రోత్సహించదని, జరుగుతున్నా అరాచకాలన్నిం టినీ ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. అయితే రాజకీయంగా అక్రమ కేసులు పెట్టి రౌడీషీట్లు ఓపెన్ చేయ డాన్ని తాము ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, వైసిపి నేతలు వేలూరు ఉమా మహేష్, బాలకృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలకు 44 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**- జాయింట్ కలెక్టర్‌కు వినతి**



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త** బీసీలకు 44 శాతం రిజర్వేషన్ కల్పించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు బీసీ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్ యాదవ్ వినతి పత్రం సమర్పించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జనాభాకు అనుగుణంగా కనీసం 44 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖలు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సిఫార్సు చేయాలని, జిల్లా బీసీ జనాభా, బీసీ ఓటర్ల శాతం, ఆర్థిక -సామాజిక పరిస్థితులపై నివేదిక పంపాలని, బీసీ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వ హించాలని కోరారు. బీసీ హక్కుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు.

## సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌లో వసతుల కల్పించకపోవడం తగదు



**కావలి, డిసెంబర్ 8 ప్రభాతవార్త :** సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌లో వసతుల కల్పన లేకపోవడం తగదని దళిత సంఘర్షన సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. మల్లి ఆద్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓ సన్ని వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. 150 హాస్టల్స్‌కు 65సంక్షేమ హాస్టల్స్ మిగిలాయన్నారు. వీటికి కూడా కనీసం వసతుల కల్పన కల్పించ లేకపోవడం భాదాకరమవిషయమన్నారు. పలు హాస్టుల్స్‌లో దోమలనివారణకు కిటికీలకు మెస్‌లు లేకపోవడం సరికాదన్నారు. మరికొన్ని హాస్టల్స్‌లు తులుపులు లేకపోవడం, బూత్‌రూములు, నీటి వసతి కూడా లేదన్నారు. ఇలా దయనీయమైన దుస్తితిలో హాస్టల్స్ ఉంటే విద్యార్థులు ఎలా ఉంటారని తెలిపారు. దీనిపై పై ఉన్నతాధికారులకు సమస్య తీసుకెలితే అన్ని వసతుల కల్పన చేపడుతామని ఊకదంపుడు మాటలు చెబుతున్నారే కాని వాటిపై నిఘాపెంచి విద్యార్థుల సౌకర్యార్థం కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్స్‌లో వసతుల కల్పన చేపట్టాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కమతం బాబు, జరుగుమల్లి విజయరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

**- జిల్లాలో ఉత్సాహభరిత కార్యక్రమాలు**



**నెల్లూరు, డిసెంబర్ 8, ప్రభాతవార్త – వైద్యం** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురష్కరించు కుని డిసెంబర్ 14నుంచి 20వరకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ లోతేటి శివశంకర్ వారి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా సూపరింటెండెఇంగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం మార్గదర్శకత్వంలో జిల్లాలోని ఐదు డివిజన్లలో నెల్లూరు టౌన్, నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఆత్మకూరు డివిజన్‌లలో విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తూ ఎలక్యూషన్, క్విజ్ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను ప్రభుత్వ పాఠశాలల 9వ, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ప్రతి డివిజన్ నుండి గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు తీసుకువచ్చి నేడు విద్యుత్ భవనంలోని స్కాడా కార్యాలయంలో సర్కిల్ లెవల్ కాంపిటీషన్స్ నిర్వహించారు. విద్యాశాఖ నిపుణులు పర్యవేక్షణలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగింది. జిల్లా స్థాయి విజేతలుః ఎలక్యూషన్ విభాగంలో కే.బ్రహ్మ నిఖిల్, డీఎస్ఆర్ జడ్పీహెచ్ఎస్ బాయ్స్, దర్గామిట్ట- మొదటి స్థానం. క్విజ్‌విభాగంలో విజేతలుగా ఈ.దాత్రి సాయి, 9వ తరగతి జడ్పీహెచ్ఎస్ వరికొండ నిలిచారు. కే.మోక్షిత, 9వ తరగతి జడ్పీహెచ్ఎస్ వరికొండ, జి.రూపిక, 9వ తరగతి జడ్పీహెచ్ఎస్ కావలి, షేక్ సనీల 9వ తరగగతి జడ్పీహెచ్ఎస్ కావలి ఈ విద్యార్థుల విజేత బృందం త్వరలో తిరుపతిలో జరగనున్న పోటీల్లో పాల్గొననుంది. ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ లోతేటి శివశంకర్ స్వయంగా అవార్డులు ప్రధానం చేయనున్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ బాలచంద్ర, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(టౌన్) శ్రీధర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(కావలి), బెనర్జీ, విద్యాశాఖ తరుపున డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎస్‌వి నాయక్, మండల విద్యాశాఖాధికారులు మురళీధర్, హేమ సుందర్, హెడ్‌మాస్టర్స్ శ్రీనివాసరావు, జుల్ఫికర్ ఆలీ, కృష్ణారెడ్డి, ఎస్‌ఏపీఎస్ లు సుధీర్, తాతాచార్యులు పాల్గొన్నారు. అలాగేడిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు సతీష్, మధు, నాయక్, అశోక్, సునీల్, కిరణ్, అసిస్టెంట్ ఇంజనీర్లు నరసింహారావు, తిరుపతయ్య, పర్సనల్ ఆఫీసర్ సురేష్, విద్యుత్ శాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా విద్యుత్ శాఖ తరుపున విజేతలైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులోను ఇంధన సంరక్షణపై మరింత ప్రజా చైతన్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయికి వెండి బక్కెట్, చెంబు బహుకరణ



**బుచ్చి డిసెంబర్ 8 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి సన్నిధిలో కాకుపల్లికి చెందిన ఎస్ వెంకటరెడ్డి, మనుజ దంపతులు శ్రీలక్ష్మీగణతి స్వామి వారి అభిషేక నిమిత్తం సుమారు 698.160 గ్రాములు విలువైన వెండి ఒక్కెట్, వెండి చెంబు భక్తితో సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్ధానం చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సహాయ కమీషనర్ కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి శ్రీనివాసులురెడ్డి పాలక మండలి సభ్యులు దాత గోత్రనామాలతో స్వామి అమ్మవారికి పూజలు నిర్వహించి శేష వస్త్రంతో సత్కరించి తీర్ద ప్రసాదాలు అందజేశారు.

## రాష్ట్రస్థాయి 14 సంవత్సరాల పెన్సింగ్ క్రీడాపోటీలు



**బుచ్చి డిసెంబర్ 8 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం సెయింట్ మేరీస్ కళాశాలలో డిసెంబర్ 9,10,11, తేదిలలో 14 సంవత్సరాల బాలబాలికలకు 69 వరాష్ట్ర స్థాయి పెన్సింగ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పి.డి.భీమతాటి వెంకటరమణ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలనుంచి 350 మంది క్రీడాకారులు కోచ్‌లు విచ్చేస్తున్నట్లు తెలిపారు. వీరందరికి అకామిడేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలతో ఏర్పాట్లు అన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైద్యసదుపాయాలు 24 గంటలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఈక్రీడలను విజయ వంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రీడలకు గట్టి బందోబస్తు ఇస్తున్న సిఐ శ్రీనివాసులురెడ్డికి ఆయన ప్రత్యే కంగా ధన్యవాదాలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.మహేష్, సుబ్బా రావు, మల్లికార్జున, సురేష్, గురవ య్య, భాస్కర్, రమేష్, ప్రదీప్, పాల్గొన్నారు.




## సాయుధ దళాల పతాక దినోత్సవనికి హుండీ డ్రైవ్



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరి ంచుకొని హుండీ డ్రైవ్‌ను జిల్లా సైనిక బోర్డు చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టరు హుండీలో తమ వంతు డబ్బులు వేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికు లకు, సైనికుల కుటుంబాలకు సాయుధ దళాల పతాక దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసారు. అంతే కాకుండా దేశ రక్షణలో సైనికుల త్యాగాలను వెలకట్టలేమని, వారి సంక్షేమానికి ఉపయోగించే సంక్షేమ నిధికి విరాళాలు సమీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సైనిక సంక్షేమ నిధికి రూ. 10 వేలు చొప్పున విరాళం అందజేసిన మాజీ సైనికులు మల్లిఖార్జున రావు, కావలి సైనిక సొసైటీ వారిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చొక్కా జేబు పై సూచకంగా ఆర్మీ సాయుధ దళాల స్టికర్‌ను అతికించి ధన్యవాదాలు తెలిపారు. డిఆర్‌ఓ ఎన్ విజయ కుమార్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి, జి. హరికృష్ణ, ఇతర జిల్లా అధికారులు, ఎన్‌సిసి ఇంస్ట్రక్టర్స్, ఎస్‌సిసి కాడిడేట్స్, జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షులు కళాధర్, ఉపాధ్యక్షులు మేడేపల్లి రత్నయ్య, ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల అభిష్టం మేరకు రాపూరును నెల్లూరు జిల్లాలోనే వుంచండి



**రాపూరు, డిసెంబరు 8ప్రభాతవార్త :** మండలంలోని ప్రజల అభిష్టం మేరకు రాపూరు మండలాన్ని నెల్లూరు జిలాలోనే కోనసాగేలా చూడాలని పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి కోరారు. ఇటీవల జిల్లాల పునర్విభజనలో భాగంగా వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండ లాలను తిరుపతి జిల్లాలో వీలీనం చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే వీటిపై ప్రజలకు ఎమైనా అభ్యంతరాలు వుంటే 30 రోజులలో తెలపాలని ఆ నోటిపికేషన్‌లో తెలిపారు. అయితే రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడాన్ని రాపూరు మండలంలోని ప్రజలు పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాపూరు మండలంలోని పంచాయితీలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున రాపూరు రెవెన్యూ కార్యలయం వద్దకు చేరుకోని తహశిల్దార్ లక్ష్మీనరసింహంకు వినతి పత్రం సమర్పించారు. రాపూరును నెల్లూరు జిల్లాలోనే వుంచేలా చూడాలని ఆ ఆర్టీలో కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాపూరు మండలానికి నెల్లూరుతో మంచి సంబందాలు వున్నాయని, ఈ ప్రాంత ప్రజలు నెల్లూరును తమ సోంత ఊరుగా భావిస్తుంటారని తెలిపారు. 60 కిలోమీటర్ల దూరంలో వున్న నెల్లూరు కాకుండా 100 కిలోమీటర్ల దూరంలో వున్న తిరుపతికి జిల్లా మారిస్తే తమకు అనేక ఇబ్బందులు వున్నాయని భావిస్తున్నారని తెలిపారు. ప్రజల అభిష్టం మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, రాష్ట విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌లు దీనిపై మరోసారి పరిశీలించి రాపూరును నెల్లూరులోనే వుంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యాక్షురాలు చిగురుపాటి ప్రసన్న, రాపూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మధు నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఫఠాన్ ఛాన్‌బాషా, కార్యదర్శి కూనిపోగు కన్నయ్య, మహిళా నాయకురాలు కోండాపురం కస్తూరి, పలు గ్రామాల సర్పంచ్‌లు, యంపీటీసీలు, నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గోన్నారు.

## రాపూరును నెల్లూరులోనే వుంచండి అంటూ కలెక్టర్‌కు వినతి



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** రాపూరు మండలాన్ని నెలూరు జిల్లాలోనే కోనసాగించా లంటూ సోమవారం రాపూరు మండల జెఎసి నాయకులు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లకు వినతి పత్రం సమర్పించారు. నెల్లూరు కలెక్టరెట్‌లో నిర్వహించిన ప్రజావిజ్ఞప్తులలో రాపూరు మండలానికి చెందిన జెఎసి నాయకులు పెద్ద ఎత్తున హాజరై ప్రస్తుతం వున్న విధంగానే రాపూరు మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే వుంచాలని తిరుపతిలో కలపవద్దని వినతి పత్రాన్ని కలెక్టర్‌కు ఆందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని వంద శాతం మంది రాపూరు నెల్లూరు జిల్లాలోనే వుండాలని కోరుకుంటున్నారని ప్రభుత్వం ప్రజల అభిష్టాన్ని గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, రాష్ట విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌లు ప్రజల ఇష్టాన్ని గుర్తించి రాపూరును నెల్లూరు జిల్లాలోనే కోనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు రాపూరు మండల యవనాయుడు మాలేపాటి చరణ్ రెడ్డి, మండల కోప్షన్ సయ్యద్, యంఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య, బోమ్మిరెడ్డి రవీంద్రా రెడ్డి, గుండవోలు ప్రశాంత్, సయ్యద్ ముత్తాహార్ పెద్ద ఎత్తున ప్రజలు వున్నారు.

## మెడికల్ క్యాంపు అదిరింది :మదన్ కుమార్‌రెడ్డి



**నెల్లూరు రూరల్ , డిసెంబర్ 8, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ రాష్ట్ర ముఖ్య నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచనలతో 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు పెనక శ్రీనివాసులురెడ్డి ఆధ్వ్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. నాగసాయి నగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో నిర్వహించిన ఈ క్యాంపులో నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్ ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఎక్స్ రే ఈసీజీ, అల్ట్రాసౌండ్ టెస్టులు, రక్త పరీక్షలు, వైద్యుల వ్యక్తిగత కన్సల్టేషన్ అన్ని ఉచి తంగా జరిపారు. ముఖ్యంగా మోకాళ్ల నొప్పులు, కీళ్ల వాపులు, నడుము నొప్పి మెడ నొప్పి, సర్వేకల్ సమ స్యలు, ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, నరాలు బిగిసుకుపోవడం వంటి సమస్యలకు సంబంధించి వైద్యం అందించారు. అలాగే షుగర్, బీపీ, గుండె సమస్యలు, ఛాతినొప్పి, శ్వాసకోస సమస్యలు, పిల్లల ఆరోగ్య సమస్యలు, చర్మవ్యాధులు తదితర రోగాల కోసం ప్రత్యేక పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ శిబిరాన్ని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మదన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా మెడికల్ క్యాంపు నిర్వహించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షులు పెనక శ్రీనివాసులురెడ్డి, కో క్లస్టర్ ఎస్‌కే ఖాదర్ భాష, కో యూనిట్ ఇన్‌చార్జి పెనక సుదీప్ రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కోదూరు వనజారెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు మన్నేపల్లి హరి ప్రసాద్, డివిజన్ కార్యదర్శి చెంగాల్వ మీరా ,నాయకులు కొల్లి పవన్ కుమార్‌రెడ్డి, రేవూరు చెంద్రరెడ్డి, హర్ష, పఠాన్ బాబు ఖాన్, పఠాన్ అబ్దుల్లా, ఖాన్, పీపుల్స్ పార్కు అసోసియేషన్ సభ్యులు చినిగా శ్రీనివాసులురెడ్డి, రామిరెడ్డి, చారి, ఈశ్వర్‌రెడ్డి పొల్గొన్నారు.

## బస్సు ప్రమాదంలో విద్యార్థి మృతి హృదయాన్ని కలిచివేసింది



**ఇందుకూరుపేట, డిసెంబర్ 8, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం మజూర వెంకటరెడ్డి కాలనీ వేపచెట్టు సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి కిరణ్ ప్రాణాలు కోల్పోయిన విషయం హృదయాన్ని తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. చిన్నారి బాలుడి అకాల మరణం అత్యంత బాధాకరమని పేర్కొంటూ కిరణ్ మృతి పట్లతన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ప్రమాదం నుంచి బయటపడిన అన్న ప్రదీప్ త్వరగా కోలుకోవాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. ఈ దుర్ఘటనలో తీవ్ర విషాధంలో ఉన్న కిరణ్ కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కిరణ్ కుటుంబం ఎదుర్కొంటున్న ఈ వేదనను మాటల్లో వ్యక్తం చేయడం సాధ్యం కాదని, భగవంతుడు వారికి దైర్యం, ఓర్పు ప్రసాదించాలని ప్రార్థించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రోడ్డు భద్రతలపై అధికారులు మరింత కఠిన చర్యలు తీసుకునే విధంగా సూచించారని తెలిపారు. చిన్నారి కిరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ఆకాంక్షించారు.

## వేమిరెడ్డి దంపతులచే అయ్యప్పలకు అన్న ప్రసాద వితరణ



**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ నాగవరపమ్మ దేవస్థానంలో శ్రీ అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి డిసెంబర్ 14వ తేది వరకు అయ్యప్ప మాల దీక్ష ధరించిన స్వాములకు గత 13 సంవత్సరాలుగా ఎటువంటి ఆటంకం లేకుండా అన్న ప్రసాద కార్యక్రమాన్ని దాతల సహకారంతో కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల సహకారంతో అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గత 13 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామన్నారు. దాతలు కూడా ఇందుకు పూర్తిస్థాయిలో తమవంతు సహకారం అందిస్తున్నారన్నారు. ఈ మేరకు సోమవారం పూజా కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీహరిరెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం అయ్యప్పలకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులకు అయ్యప్పలు పెద్ద ఎత్తున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి , తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థీ వేడుకలు



**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** కోవూరులోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వెలసి ఉన్న వరసిద్ధి వినాయక స్వామికి సోమవారం సంకటహర చతుర్థీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్ధంగా భక్తి శ్రద్ధతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

## నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షులు,కార్యదర్శి



**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నెల్లూరు జిల్లా కార్యదర్శిగా మేకల మల్లికార్జున బాబు నియమితులైన సందర్భంగా..కోవూరు నియోజకవర్గ వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షులు బలంరెడ్డి చెంచురెడ్డితో, సీనియర్ న్యాయవాదులు గోమతం శ్యామాచార్యులు , శ్రీని వాసులురెడ్డి , జనార్దన్ , బాలకృష్ణ , ఇన్నమూరి నరసింహారావు ,మాజీ మంత్రివర్యులు, వైసీపీ రాష్ట్ర PAC సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని నెల్లూరు లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణ రెడ్డి , వైసిపి జిల్లా పార్టీ రైతు విభాగం అధ్యక్షులు శివుని నరసింహారెడ్డి , వైసీపీ యాక్టివిటీ విభాగం జిల్లా కార్యదర్శి నలుబోలు సుబ్బారెడ్డి , కోవూరు మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి , కోవూరు మండల AAB మాజీ ఛైర్మన్ నిలపరెడ్డి హరిప్రసాద్ రెడ్డి , వైసీపీ సీనియర్ నాయకులు ఆదిప్ రెడ్డి , జన గౌడ్ , నంబూరు సతీష్ వైసీపీ నాయకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ కార్యాలయాలకు అద్దెలు చెల్లించాలి

**- ఐటీడీపీ నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు తాకీదు- కోవూరులో ఇదీ సంగతి**



సచివాలయం (ఫైల్‌ఫోటో)

**కోవూరు, డిసెంబరు8 ప్రభాతవార్త :** ప్రభుత్వ భవనంలో ప్రభుత్వ శాఖలు పనులు చేస్తున్నా దానికి అద్దె చెల్లించాలంటూ ఐటీడీఏ తాకీదు ఇవ్వడం కోవూరులో సోమవారం సంచలనం కలిగించింది. వివరాల్లోకి వెళ్తే.. కోవూరులోని శాంతినగర్ 2వ వీధిలో 2015వ సంవత్సరానికి ముందు అప్పటి ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా పశు వైద్య శాలకు సంబంధించిన స్థలంలో గిరిజన బాలుర వసతి గృహం ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి నిర్మాణం కూడా పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. అనంతరం కొంత కాలం పాటు గిరిజన బాలుర వసతి గృహం నిర్వహించినా అనంతరం బాలురు లేక ఇక్కడి నుంచి బుచ్చికి తరలించారు. అప్పటి నుంచి ఈ గిరిజన వసతి గృహం నిరుపయోగంగా పడి ఉంది. ఈ నేపథ్యంలో నిరుపయోగంగా ఉన్న ఈ గిరిజన వసతి గృహాన్ని ప్రభుత్వ భవనాలకు ఉపయోగించుకునే ఉద్దేశంతో 2019లో ఉన్న అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇందులో సచివాలయం, రైతు సేవా కేంద్రం , ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, ప్రభుత్వ పాఠశాల , పోస్టాఫీస్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గత ఆరు సంవత్సరాలుగా ఈ గిరిజన బాలుర వసతి గృహాన్ని లక్షలాది రూపాయలు పెట్టి మరమ్మతులు చేయించి సంబంధిత ప్రభుత్వ శాఖలు వాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వారం క్రితం గిరిజన సంక్షేమ శాఖ నుంచి కొంతమంది ఉద్యోగులు వచ్చి ఇది తమ శాఖకు సంబంధించిందని, ఇందులో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఉంటున్నారని, సంబంధిత ఉద్యోగుల ఎదుట వాదోపవాదాలు జరిగాయి.

**- ప్రభుత్వ శాఖలు అద్దెలు చెల్లించాలి** శాంతినగర్‌లో ఉన్న గిరిజన బాలుర వసతి గృహంలో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన నాలుగు శాఖలు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పోస్టాఫీస్ కార్యకలాపాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఐటీడీఏ శాఖను ఈ ఐదు శాఖలకు రిజిస్టర్ పోస్టు ద్వారా లెటర్ రావడం జరిగింది. అందులో గిరిజన బాలుర వసతి గృహానికి సంబంధించిన ఈ భవనాన్ని ఎటువంటి అనుమతులు లేకుండా ఇతర ప్రభుత్వ శాఖలు ఆక్రమించుకుని ఉంటున్నాయని పేర్కొంటూ వీరు ఆక్రమించుకున్నప్పటి నుంచి నేటి వరకు అద్దె చెల్లించాలంటూ తాకీదులో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల వారు 6370 రూపాయలు, సచివాలయం 3800 రూపాయలు, రైతు సేవా కేంద్రం 4290 రూపాయలు, ప్రాథమిక ఉప కేంద్రం 1050 రూపాయలు , పోస్టాఫీస్ 2140 రూపాయలు, నెలకు అద్దె చెల్లించాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారు చేరినప్పటి నుంచి ఇప్పటివరకు అద్దె మొత్తం లెక్కగట్టి ఐటీడీఏకు చెక్కు రూపేనా అందించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో ఈ భవనంలో విధులు నిర్వహిస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఆందోళనకు గురై వెంటనే ఈ విషయాన్ని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ భవనాల్లో ప్రభుత్వానికి చెందిన శాఖలే కార్యకలాపాలు నిర్వహిస్తుంటే దీనికి అద్దెలు చెల్లించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

**- ఉత్తర్వుల మేరకే వివిధ శాఖలు** కోవూరులోని శాంతినగర్ 2వ వీధిలో నిరుపయోగంగా పడి ఉన్న బాలుర వసతి గృహాన్ని 2019లో ఉన్న అప్పటి జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకే ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన సచివాలయం, రైతు సేవా కేంద్రం, ప్రాథమిక ఉప కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఐటీడీఏ శాఖ ప్రభుత్వ భవనాలకు అద్దె చెల్లించాలనే విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.